క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్‌ఎస్‌సీపీడీసీఎల్-11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు.

- ప్లే గ్రౌండ్ ఫీడర్ పరిధిలో బుర్జుగల్లీ, కుమ్మరివాడీ, ఎరుకల బస్తీ, గాంధీబొమ్మ, రహత్‌నగర్, వాణి ఫోటో స్టూడియో, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో 9 నుంచి 11 గంటల వరకు, అయ్యప్ప ఆలయం ఫీడర్ పరిధిలోని బతుకమ్మ కుంట, రెడ్ బిల్డింగ్, మల్లికార్జుననగర్, రామకృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో 10 నుంచి 11 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు.
- నారాయణగూడ ఫీడర్ పరిధిలోని నారాయణగూడ, సోప్ ఫ్యాక్టరీ, ఎమ్మార్వో ఆఫీస్, డీఈ ఆఫీస్, వాటర్‌వర్క్స్, అచ్చయ్యనగర్ తదితర ప్రాంతాల్లో 3 నుంచి 4.30 గంటల వరకు, ప్రివెంటివ్ మెడిసిన్ ఫీడర్ పరిధిలోని బాగ్‌లింగంపల్లి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, నారాయణగూడ తదితర ప్రాంతాల్లో 2.30 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

3న మున్నూరు కాపు జేఏసీ సమావేశం

కాచిగూడ: మున్నూరు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న మధ్యాహ్నం 2 గంటలకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలోని షోయబ్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఎడ్ల రవి పటేల్ తెలిపారు. మున్నూరు కాపు కార్పొరేషన్ సాధన, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మున్నూరు కాపు అభ్యర్థులను గెలిపించుకోవడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మున్నూరు కాపులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సూచనలు, సలహాలు ఇచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చరిత్రలో నిలిచిపోతుంది

ఉప్పల్: ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించినందుకు కాంగ్రెస్ అధినాయకత్వానికి అభినందనలు తెలుపుతూ గురువారం ఉప్పల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ లింగంపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఉప్పల్ చౌరస్తాలోని డా.అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చరిత్రలో నిలిచిపోతుందని పలువురు నేతలు కొనియాడారు. నిరుపేదల సంక్షేమం కాంగ్రెస్ పాలనతోనే సాధ్యం అన్నారు. దేశ ప్రజలంతా కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారని అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు మేకల శివారెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి, ఎ-బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్ రెడ్డి, బోరంపేట కృష్ణ, తవిడ బోయిన గిరి బాబు, ఈగ అంజయ్య, బకారం లక్ష్మణ్, మహిళా అధ్యక్షురాలు అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి


ముషీరాబాద్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు రాఖీ కడుతున్న మహిళలు


ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు


హర్యానా గవర్నర్ దత్తాత్రేయకు రాఖీ కడుతున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

సోదర సోదరీమణుల ఆప్యాయత, అనురాగ బంధాలకు నిదర్శనంగా నిలిచే రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్) వేడుకలను ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ల పరిధిలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం తమ అన్న, తమ్ముళ్లకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించగా..., సోదరులు తమ సోదరీమణులకు ఎల్లప్పుడూ రక్షణగా ఉంటామని, ఎప్పుడూ ఆనందోత్సాహాలతో ఉండాలని దీవించి కానుకలు అందజేశారు. ముషీరాబాద్, అంబర్‌పేట ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ఇతర రాజకీయ నాయకులకు పలువురు మహిళలు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు.

– ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ల బృందం



ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్‌కు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుతున్న రెయిన్‌బో హోమ్ చిన్నారులు


మైనార్టీ మోర్చా నేత మహమూద్‌కు రాఖీ కడుతున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్


టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్ ముదిరాజ్‌కు రాఖీ కడుతున్న సోదరీమణి


టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్, సంగిశెట్టి రాజ్‌కుమార్‌లకు రాఖీలు కడుతున్న సోదరీలు


ఎమ్మెల్యే కాలేరుకు రాఖీ కడుతున్న బీఆర్ఎస్ మైనార్టీ నాయకురాలు ఇర్ఫానా సుల్తానా

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం


రాఘవేంద్రస్వామి బృందావన సమితిలో పూజలందుకుంటున్న రాఘవేంద్రస్వామి


బర్కత్‌పురలో రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల అంకురార్పణ కార్యక్రమంలో మఠం మేనేజర్

కాచిగూడ: రాఘవేంద్ర తీర్థ గురుసార్వభౌమ 352వ ఆరాధన మహోత్సవం సందర్భంగా గురువారం బర్కత్‌పురలోని మంత్రాలయ శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ఆరాధన మహోత్సవ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, సినీ ప్రొడ్యూసర్ తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతం, వేదపారాయణం, విశేష ఫల పంచామృత అభిషేకం, కనక మహాపూజ, తులసి అర్చన, నైవేద్యం, మహా మంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ కె.రాఘవేందర్ రావు, మఠం అర్చకులు, సిబ్బంది, సాయి, మల్లేష్, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి బృందావన సమితిలో...
కాచిగూడ, లింగంపల్లిలోని రాఘవేంద్రస్వామి బృందావన సమితిలో శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. సుప్రభాతం, అష్టోత్తరం, పంచామృత, మధు అభిషేకం, అలంకరణ తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కర్ణాటక సింగర్ అనంతరాజ్ మిస్త్రీచే నిర్వహించిన దాసవాణి కార్యక్రమం భక్తులందరినీ ఆకట్టుకుంది. శ్రీరాఘవేంద్రస్వామి బృందావన సమితి కార్యదర్శి బీపీ రాఘవేంద్ర రావు, మేనేజర్ నరసింహాచార్ కండ్లూర్ పాల్గొన్నారు.

తెలంగాణ భావ్‌సార్ క్షత్రియ మహిళా పరిషత్ కార్యవర్గం ఎన్నిక


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కాచిగూడ: తెలంగాణ భావ్‌సార్ క్షత్రియ మహిళా పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక కాచిగూడ, సుందర్‌నగర్‌లోని భావ్‌సార్ భవన్‌లో గురువారం జరిగింది. అధ్యక్షురాలిగా విజయలక్ష్మి సూత్రవే, ప్రధానకార్యదర్శిగా సంగీత పాటాలేతో పాటు వివిధ పదవులకు మహిళలు ఎన్నికయ్యారు. అనంతరం వీరంతా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సమాజ భూషణ్ రాజశ్రీ సూత్రవే, వసంత బగాడే, ఉమా రతన్ పాల్కే, అరుణ్‌జ్యోతి లోఖండే, అనితా లోఖండే, స్వర్ణ భాండేకర్ తదితరులు మాట్లాడారు. వివిధ జిల్లాలకు చెందిన మహిళా ప్రతినిధులు మరాఠీ సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం నిర్వహించిన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు, మహిళలు

కాచిగూడ: మహిళలకు కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ.200 రాయితీ ఇవ్వడం గొప్ప పరిణామం అని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ పార్టీ కార్యాలయం వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళలు కలిసి పాలాభిషేకం చేశారు. దేశంలోని మహిళల అభివృద్ధికి, సాధికారతకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గౌతంరావు తెలిపారు. బీజేపీ నేతలు ఎ.సూర్యప్రకాష్ సింగ్, సి.వినోద్ యాదవ్, కేశబోయిన శ్రీధర్, నీరజ, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

చిరస్మరణీయురాలు జమునారమణారావు


మాట్లాడుతున్న రాజగోపాలరావు

చిక్కడపల్లి: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సిటీ కల్చర్ సెంటర్‌లో ప్రజా నటి డాక్టర్ జమునారమణారావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫ్యాక్టరీస్ డైరెక్టర్ బి.గోపాలరావు మాట్లాడుతూ, జమునారమణారావు చిరస్మరణీయురాలని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ కేవీ కృష్ణకుమారి, సినీ విజ్ఞాన విశారద ఎస్‌వీ రామారావు, గాయకుడు వైఎస్ రామకృష్ణ, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


భారత్ సేవా సమాజ్ వీధిలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని భారత్‌సేవా సమాజ్ వీధిలో రూ.20.70 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డునిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠాగోపాల్, డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌ప్రసాద్, ఆకుల అరుణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం కబరస్తాన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం
ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని శ్మశాన వాటికలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని ముస్లిం కబరస్తాన్‌లో గుసల్‌ఖానా, వాజుఖానా, పవర్ బోర్ ఏర్పాటుకు 11 లక్షల రూపాయల నియోజకవర్గ అభివృద్ధి నిధులను కేటాయించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ గురువారం ఈ పనులను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ముఠా జైసింహ, కబరస్తాన్ కమిటీ అధ్యక్షులు ఖామిల్, అబ్దుల్ రహీం, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ యూనుస్, హబీబ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మనోహర్ సింగ్, మహ్మద్ జహంగీర్, మహ్మద్ ఖదీర్, అబూ, షేక్ మహ్మద్, బషీర్, వాయబ్, సిద్దిఖ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ
ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లోని అంజుమన్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, డివిజన్ కార్పొరేటర్ గౌసుద్దీన్ హాజరై 75 మందికి షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, పార్టీ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, రవీందర్‌కోళ, జునేద్ బాగ్దాదీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరి సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి
చిక్కడపల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలందరి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయాల్లో ధూపదీప నైవేద్యం, వేతనం రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు పెంచిన సందర్భంగా గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీ గణపతి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఠాగోపాల్ మాట్లాడుతూ, కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం ధూపదీప నైవేద్యం, వేతనం రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు పెంచడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, ఈఓ పాశం లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేష్ కుమార్, బత్తుల కిరణ్‌కుమార్, రాజ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు సి.వెంకట గోవిందరావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

- వాడవాడలా జ్వర పీడితులు
- నిత్యం ఫీవర్‌కు 350 నుంచి 700 మంది రోగులు
- వాతావరణంలో మార్పులే కారణమంటున్న వైద్యులు

నల్లకుంట: వాతావరణంలో వచ్చిన మార్పులకు తోడు, పారిశుద్ధ్యం లోపించడం, దోమలు వృద్ధి వంటి కారణాలతో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు చిన్న పిల్లలు, పెద్దలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. వర్షాలు పడాల్సిన సమయంలో భానుడి ప్రతాపం చూపటం, అదే సమయంలో పగటి పూట ఉక్కపోత, రాత్రిళ్లు చల్లటి వాతావరణం ఉండటం రోగాలకు కారణమవుతోంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నపిల్లలు విష జ్వరాలతో పాటు నియోనియా, ఆస్తమా, దమ్ము వంటి వ్యాధులకు గురవుతున్నారు. దీంతో గత రెండు వారాలుగా చిన్న పిల్లల ఆసుపత్రులు, ప్రభుత్వ ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరుగుతోంది. వాడవాడలా జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది.

ఈ నెల 1వ తేదీ నుంచి ఫీవర్ ఆసుపత్రికి వచ్చిన ఓపీ రోగుల సంఖ్య

1వ తేది	360	17న	435		
2న	320	18న	422		
3న	347	19న	410		
4న	350	21న	526		
5న	330	22న	500		
7న	430	23న	500		
8న	350	24న	480		
10న	390	25న	420		
11న	340	26న	520		
12న	370	28న	634		
13న	500	29న	480		
16న	480	30న	455		


ఫీవర్ ఆసుపత్రి ఓపీ వద్ద బారులు తీరిన రోగులు

- నగరంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. అందుకు స్థానిక బస్తీ దవాఖానాలు, యూపీహెచ్‌సీలకు వచ్చే రోగుల సంఖ్యే అద్దం పడుతోంది.
- ప్రధానంగా నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి రోజు 350 నుంచి 7 వందల వరకు రోగులు వస్తున్నారు. వారిలో నాలుగు వందలకు పైగా జలుబు, దగ్గు, విష జ్వరాలతో బాధపడుతున్న వారే కావడం గమనార్హం.

జలుబుతో మొదలై..

- తొలుత జలుబుతో మొదలై దగ్గుతో చివరకు నిమోనియాగా మారుతోంది. తీవ్రత పెరగడంతో పలువురు పిల్లలు ఆస్తమా, ఫిట్స్‌కు గురవుతున్నారు. పగలు వేడిగా ఉండటం, రాత్రిళ్లు చల్లటి వాతావరణం ఉండటంతో పిల్లల శరీరం ఇందుకు తట్టుకోవడం లేదని వైద్య నిపుణులంటున్నారు. తేమ శాతం తగ్గటం, పెరగటం వల్ల గొంతు ఇన్‌ఫెక్షన్లు కూడా వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నందున సాధ్యమైనంత వరకు బయట తిప్పకూడదు.
- చల్లటి పదార్థాలు, చల్లని నీరు తాగించకూడదు. గోరు వెచ్చటి నీటిని మాత్రమే తాగించాలి.
- చల్లటి గాలి తగలకుండా దలసరి దుస్తులు వేయాలి.
- రెండు మూడు రోజుల్లో జలుబు, దగ్గు తగ్గకుంటే చిన్న పిల్లలను వైద్యుల వద్దకు తీసుకు వెళ్లాలి.
- 31న మధ్యాహ్నం 1 గంటల వరకు 420 మందికి పైగా రోగులు ఓపీ విభాగంలో చికిత్సలు పొందారు. రోజుకు పదుల సంఖ్యలో రోగులు ఇన్ పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు.


రక్త నమూనాలు సేకరిస్తున్న ల్యాబ్ సిబ్బంది

ఏ మాత్రం అశ్రద్ధ చేయవద్దు

చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి జలుబు, దగ్గు, నిమోనియా కేసులు వస్తున్నాయి. చాలా కేసుల్లో కొద్దిపాటి జలుబు, దగ్గుతో మొదలుకాగానే జాగ్రత్త పడటం మంచిది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా రోగుల సంఖ్య వందలు దాటింది.

– డాక్టర్ కె.శంకర్, ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం శ్రావణపౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు అత్యంత భక్తి శ్రద్ధాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చండీ హోమంతో పాటు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుండెపూడి మురళీ ప్రసాద్, ఈఓ మాచర్ల దేవనాథం, ఆలయ ధర్మకర్తలు మురికిగణేష్, జీకే రమణ, డాక్టర్ రామకృష్ణ, పద్మ బాసాని, అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, వెంకటాద్రి, ఆచారి పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


చిక్కడపల్లి: ఎలక్ట్రీషియన్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్, ఎస్ఐ నాగరాజు తెలిపిన కథనం ప్రకారం...బాపునగర్‌లో నివసించే ఎంవై సప్తగిరి(44) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు.ఆయనకు భార్య శారద, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా సప్తగిరి తరచూ మద్యం తాగి కుటుంబ సభ్యులను డబ్బులు అడిగేవాడు. మద్యం మత్తులో భార్య, తల్లితో గొడవపడే వాడు. గురువారం రాఖీ పౌర్ణమి కావడంతో సప్తగిరి భార్య శారద ఉప్పల్‌లో ఉండే తన సోదరుడికి రాఖీ కట్టడానికి వెళ్లారు. సప్తగిరి గురువారం మధ్యాహ్నం మద్యం తాగడానికి డబ్బులు అడగడంతో తల్లి ఇతర కుటుంబ సభ్యులు మందలించారు. ఈ క్రమంలో బెడ్రూమ్‌లోకి వెళ్లిన సప్తగిరి గడియ పెట్టుకుని ఫ్యాన్‌కు శాలువాతో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తలుపుబద్దలు కొట్టి అతడిని ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, గతంలో కూడా సప్తగిరి మద్యానికి డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబ సభ్యులను బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం


శంకరమఠం యాగశాలలో చండీ హోమం నిర్వహిస్తున పండితులు

నల్లకుంట: పౌర్ణమి సందర్భంగా గురువారం నల్లకుంట శంకర మఠంలోని శారదా మాతకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం మఠం ప్రాంగణంలోని యాగశాలలో పండితుల మంత్రోచ్ఛరణల నడుమ చండీ హోమం నిర్వహించారు. నవధాన్యాలు, పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, సుగంధ ద్రవ్యాలు, అమ్మవారికి సమర్పించిన నూతన వస్త్రాలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి కావించారు. అలాగే ఆలయంలోని అమ్మవారికి చండీ పూజలు చేశారు. పూజల్లో శంకరమఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కె.కృష్ణారావు దంపతులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేసి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ప్రొ.జీబీ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: మేధో సంపత్తి హక్కుల (ఐపీఆర్) పై పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన అవసరమని ఓయూ న్యాయకళాశాల ప్రొఫెసర్ జీబీ రెడ్డి అన్నారు. గురువారం క్యాంపస్‌లోని సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీఎస్‌సీవోఎస్‌టీ), ఓయూ ఐపీఆర్ సెల్ ఆధ్వర్యంలో ఐపీఆర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ప్రొ.జీబీ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యావేత్తలు, పరిశోధకులు తమ పరిశోధనలు, ఆవిష్కరణలు(కనుగొన్న నూతన అంశాలు) ప్రచురించే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమాచారాన్ని వినియోగించుకునే ముందు ఆయా అంశాలపై లోతైన పరిశీలనతో పాటు మేధో సంపత్తి హక్కులపై స్పష్టత తీసుకోవడం అవసరమన్నారు. ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య, సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చెన్నరెడ్డి, టీఎస్‌సీవోఎస్‌టీ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రాధిక ప్రసంగించారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

లిబర్టీ: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 22 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని దళిత బహుజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర శాఖ కో ఆర్డినేటర్ ఇటికా గణేష్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలని కోరారు. గురువారం సమాఖ్య కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేవలం ఐదు వేల టీచర్ పోస్టులకు మాత్రమే ప్రభుత్వం భర్తీ చేస్తుందని పేర్కొన్నారు. ప్రధానంగా ఆంగ్ల, గణిత, సైన్స్ వంటి కీలక పోస్టులు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు అనేక సంవత్సరాలుగా ఖాళీగా ఉండటం వల్ల విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా ఆచరణలో ఉపాధ్యాయ పోస్టులు ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. 30 మంది విద్యార్థులకు ఒక్క టీచర్ ఉన్నారని ఇది హేతుబద్ధం కాదని అన్నారు.